జ్వాల
# దశ
నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM

సోమవారం 02 02 2026

సంపుటి 1 సంచిక 72

పేజీలు : 04

PRGI No : TGTEL/25/A4195






## ఉత్పాదకత, ఉపాధి కల్పనే
# టార్గెట్..

### కేంద్ర బడ్జెట్ 2026 ప్రవేశపెట్టిన కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్

### సెమీ కండక్టర్ల రంగానికి రూ.40,000 కోట్లు

**దశ, న్యూఢిల్లీ:** కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం పార్లమెంట్‌లో బడ్జెట్ 2026 ప్రవేశపెట్టారు. సంస్కరణల ద్వారా స్థిరమైన ఆర్థిక వృద్ధి సాధించేందుకు ప్రభుత్వం దృష్టి సారించిందని, ఉత్పాదకతను మెరుగుపరచడం, ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. వరుసగా తొమ్మిదో సారి లోక్‌సభలో వార్షిక బడ్జెట్ ను ప్రవేశపెట్టిన నిర్మలా సీతారామన్.. 85 నిమిషాల సేపు ప్రసంగించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, 21వ శతాబ్దం పూర్తిగా టెక్నాలజీ ఆధారితంగా నడుస్తోందని, అందువల్ల సాంకేతికతను సామాన్యుడిగా కూడా అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంటుందని అన్నారు. ఈ దిశగా టైర్ 2, టైర్ 3 నగరాల అభివృద్ధికి ఏటా రూ.1,000 కోట్ల చొప్పున కేటాయిస్తున్నాయని చెప్పారు. ఈ నిధులు ముఖ్యంగా సాంకేతిక ఆధారిక వృద్ధి, మౌలిక సదుపాయాలన కల్పన, పట్టణ ప్రణాళికను బలోపేతం చేయడానికి ఉపయోగపడతాయని చెప్పారు. తద్వారా ఈ నగరాలు వేగవంతమైన ఆర్థికాభివృద్ధిని సాధిస్తాయని చెప్పారు.

సెమీ కండక్టర్ల రంగానికి రూ.40,000 కోట్లు

సెమీకండక్టర్ రంగంలో రెండు కీలకమైన ప్రకటనలను నిర్మలా సీతారామన్ బడ్జెట్‌లో ప్రకటించారు. రేర్ ఎర్త్ మినరల్స్ కోసం ఒడిశా, కేరళ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడులో రేర్ ఎర్త్ కేరిడార్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇందుకోసం రూ.40,000 కోట్లు పెట్టుబడులు పెడతామన్నారు. మినరల్స్ విషయంలో ఇండియా స్వయంసమృద్ధి సాధించేందుకు ఈ చర్య ఎంతగానో ఉపకరిస్తుందని చెప్పారు. ఇందువల్ల మేగ్నట్స్, రేప్ ఎర్త్స్‌పై మనం ఆధారపడటం తగ్గుతుందని అన్నారు. అరుదైన వ్యాధుల చికిత్సకు అవసరమైన

..మిగతా 4వ పేజీలో →

**ధరలు తగ్గేవి..**

వీడియో గేమ్ కన్సోల్‌లు,విదేశీ టూర్ ప్యాకేజీలు,తోలు వస్తువులు, పాదరక్షలు,సౌరశక్తి పరికరాలు, మైక్రోఓవెన్‌లు, విమాన భాగాలు, క్యాన్సర్ మందులు, సీఫుడ్స్.

**ధరలు పెరిగేవి...**

స్ర్కాప్, మద్యం, బొగ్గు, విలాసవంతమైన వాచీలు, స్టాక్ ఆప్షన్లు, ఫ్యూచర్స్ ట్రేడింగ్, చరాస్తులను , వెల్లడించకపోతే జరిమానా, కాఫీ వెండింగ్ మెషీన్లు.

## ముగిసిన కేసీఆర్ విచారణ



**దశ, హైదరాబాద్:** హైదరాబాద్‌లోని నందినగర్ నివాసంలో తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై జరిగిన సిట్ విచారణ ఎట్టకేలకు ముగిసింది. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ప్రారంభమైన ఈ ప్రక్రియ సుమారు నాలుగు గంటల 50 నిమిషాల పాటు ఏకధాటిగా సాగింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటి వరకు సేకరించిన కీలక ఆధారాలు.. పట్టుబడిన అధికారుల వాంగ్మూలాలను కేసీఆర్ ముందు ఉంచి అధికారులు ప్రశ్నల వర్షం కురిపించారు. ముఖ్యంగా ఈ ట్యాపింగ్ వ్యవహారం వెనుక ఉన్న అసలు సూత్రధారి మీరేనా..? అన్న కోణంలో అధికారులు ఆయన్ను ప్రశ్నించినట్లు తెలుస్తోంది.

ఈ విచారణలో మాధాపూర్ డీసీపీ రీతిరాజ్, ఐపీఎస్ అధికారులు విజయ్ కుమార్, నారాయణరెడ్డితో పాటు అడిషనల్ ఎస్పీలు అరవింద్ కుమార్,

..మిగతా 4వ పేజీలో →

## మరో ఉద్యమంలా బీఆర్ఎస్ నిరసన!

### కాంగ్రెస్ కక్షపూరిత రాజకీయాలపై భగ్గుమన్న తెలంగాణ సమాజం

### ఊరువాడ, పల్లెపట్నం అనే తేడా లేకుండా జనం రోడ్లపైకొచ్చి రేవంత్ రెడ్డి పాలనపై తిరుగుబావుటా

### కక్షపూరితంగా 'సిట్' నోటీసులు జారీ చేయడంపై బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆగ్రహం..

### ఇబ్రహీంపట్నం లో బైక్ ర్యాలి

### అంబేద్కర్ చౌరస్తాకు వెళ్లి రోడ్డుపై బైఠాయింపు

### పాల్గొన్న జిల్లా పార్టీ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి.

**దశ, రంగారెడ్డి :** కాంగ్రెస్ కక్షపూరిత రాజకీయాలపై తెలంగాణ సమాజం భగ్గుమంటున్నది!. ఊరువాడ, పల్లెపట్నం అనే తేడా లేకుండా జనం రోడ్లపైకొచ్చి రేవంత్ రెడ్డి పాలనపై తిరుగుబావుటా ఎగురవేస్తున్నారు. ఉద్యమనేత కేసీఆర్ కి కక్షపూరితంగా 'సిట్' నోటీసులు జారీ చేయడంపై బీఆర్ఎస్ నాయకులు,

..మిగతా 4వ పేజీలో →





# మదుపర్లకు బ్లాక్ డే

## భారీ నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు..

**దశ, ఇంటర్నెట్ డెస్క్:** బడ్జెట్ వేళ..దేశీయ మార్కెట్లు భారీ నష్టాలతో ముగిశాయి. కేంద్రం.. బడ్జెట్ 2026 ప్రవేశపెట్టిన ఈ చారిత్రాత్మక ఆదివారం నాడు భారత స్టాక్ మార్కెట్లు భారీ అస్థిరతకు లోనయ్యాయి. ఉదయం లాభాలతో ప్రారంభమైనప్పటికీ.. బడ్జెట్ ప్రసంగం ముగిసే సమయానికి ఇన్వెస్టర్లు ఒక్కసారిగా అమ్మకాలకు మొగ్గు చూపడంతో మార్కెట్లు ఒక్కసారిగా నేలకు దిగాయి. నూతన బడ్జెట్‌లో కంపెనీల బైబ్యాక్‌పై పన్ను విధించడం సహా ఫ్యూచర్స్ ట్రేడింగ్‌పై సెక్యూరిటీ ట్రాన్సాక్షన్ ట్యాక్స్‌ను పెంచడం మార్కెట్ల పతనానికి కారణమైంది. ఒకానొక దశలో 2400 పాయింట్లకు పైగా పతనమై 80వేల దిగువకు చేరిన సెన్సెక్స్.. చివరకు 1546 పాయింట్లు పతనమై 80,722 వద్ద స్థిరపడింది. 495 పాయింట్ల భారీ నష్టాన్ని చవిచూసిన నిఫ్టీ.. 24,119 వద్ద ముగిసింది. బడ్జెట్ నేపథ్యంలో ఆదివారం అయినప్పటికీ పనిచేసిన మార్కెట్లు.. మదుపర్లకు బ్లాక్‌సండేను మిగిల్చాయి. బడ్జెట్ ప్రవేశపెట్టిన రోజున సెన్సెక్స్, నిఫ్టీలు ఇంత భారీ స్థాయిలో పతనమవడం గత ఆరేళ్లలో ఇదే తొలిసారి. బడ్జెట్ ప్రసంగానికి ముందు ఫ్లాట్‌గా ట్రేడైన సూచీలు.. మధ్యలో



సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్(ఎస్‌టీటీ) ప్రస్తావన రావడంతో మెల్లగా నష్టాల్లోకి జారుకున్నాయి. తాజా బడ్జెట్‌లో ఎస్‌టీటీని 0.02 నుంచి 0.05 శాతానికి పెంచుతున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఎస్‌టీటీని పెంచుతున్నట్లు కేంద్రం ప్రకటించడంతో బ్రోకరేజీ కంపెనీల షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. దీంతో 18 శాతం వరకు ఆయా కంపెనీల షేర్లు ఒక్కసారిగా పతనమయ్యాయి. బీఎస్ఈలో మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీ షేర్లు 18.08 శాతం మేర పడిపోయి.. రూ.2,068కి చేరింది. గ్రో మాతృ సంస్థ బిలియన్ బ్రెయిన్ గ్యారెజీ వెంచర్స్ షేర్లు 13 శాతం మేర క్షీణించి రూ.154కు చేరాయి. ఐఐఎఫ్ఎల్ క్యాపిటల్ 10.4 శాతం పతనమై రూ.296.10కి చేరింది. ఏంజెల్ వన్ స్టాక్ కూడా 11.84 శాతం మేర నష్టపోయి రూ.2,237.95కి పడిపోయాయి.

### నష్టాలకు ప్రధాన కారణాలివే..

**ఎస్‌టీటీ పెంపు:** ఫ్యూచర్స్ ట్రేడింగ్‌పై సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ టాక్స్(STT) ను 0.05 శాతానికి పెంచడం ట్రేడర్లలో నిరాశ కలిగించింది.

**పన్ను శ్లాబుల్లో మార్పు లేకపోవడం:** మధ్యతరగతి ప్రజలు, వేతన జీవులు ఆశించిన విధంగా ఆదాయపు పన్ను శ్లాబుల్లో ఎటువంటి ఊరట లభించకపోవడం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది.

**ప్రాఫిట్ బుకింగ్:** బడ్జెట్‌కు ముందు కొన్ని రోజులుగా మార్కెట్లు పెరగడంతో, కీలక నిర్ణయాల తర్వాత ఇన్వెస్టర్లు లాభాలను స్వీకరించడానికి ప్రాధాన్యత ఇచ్చారు.

# డేంజర్ లో మేడిగడ్డ





### దేశంలోనే అత్యంత ప్రమాదకర స్థితిలో ఉన్న జలాశయాల జాబితాలో..

### కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో వెల్లడి.

### 2025 తనిఖీల ఆధారంగా దీనిని కేటగిరీ-1 అత్యంత ప్రమాదకరం .

**దశ, కరీంగనర్:** దేశంలోనే అత్యంత ప్రమాదకర స్థితిలో ఉన్న జలాశయాల జాబితాలో తెలంగాణలోని మేడిగడ్డ బ్యారేజీ చేరినట్లు కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో వెల్లడించింది. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ 2025 తనిఖీల ఆధారంగా దీనిని కేటగిరీ1 అత్యంత ప్రమాదకరం కింద వర్గీకరించింది. మేడిగడ్డతో పాటు ఉత్తరప్రదేశ్‌లోని లోయర్ ఖజూరి, ఝార్ఖండ్‌లోని బొకారో బ్యారేజీలు కూడా ఈ జాబితాలో ఉన్నాయి. మరమ్మతులు తక్షణమే చేపట్టకపోతే భద్రతకు పెను ముప్పు పొంచి ఉందని కేంద్రం హెచ్చరించింది. దేశవ్యాప్తంగా 50 ఏళ్లు దాటిన డ్యామ్‌లు 1,681 ఉన్నాయని, డ్యామ్ సేఫ్టీ యాక్ట్2021 ప్రకారం వీటిపై రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించింది.దేశవ్యాప్తంగా ఉన్న జలాశయాల భద్రతపై కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో కీలక గణాంకాలను వెల్లడించింది. తెలంగాణలోని కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ (లక్ష్మి) బ్యారేజీ దేశంలోనే అత్యంత ప్రమాదకర స్థితిలో ఉన్న మొదటి మూడు డ్యామ్‌ల జాబితాలో చేరడం ఆందోళన కలిగిస్తోంది. లోక్‌సభలో ఎంపీలు అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) 2025 వర్షాకాలం తర్వాత నిర్వహించిన తనిఖీల్లో మూడు ప్రధాన జలాశయాలను 'కేటగిరీ1' (అత్యంత ప్రమాదకరం) కింద వర్గీకరించారు. అందులోతెలంగాణలోని మేడిగడ్డ బ్యారేజీ, ఉత్తరప్రదేశ్‌లోని లోయర్ ఖజూరి డ్యామ్, ఝార్ఖండ్‌లోని బొకారో బ్యారేజీ.ఈ జలాశయాల భద్రత విషయంలో తక్షణమే నివారణ చర్యలు , మరమ్మతులు చేపట్టకపోతే భారీ రిస్క్ పొంచి ఉందని కేంద్రం స్పష్టం చేసింది. మేడిగడ్డ విషయంలో తలెత్తిన లోపాలను సరిదిద్దేందుకు మరియు బ్యారేజీ రక్షణ కోసం

..మిగతా 4వ పేజీలో →

# ఉత్పాదకత, ఉపాధి కల్పనే టార్గెట్..

**మొదటి పేజీ తరువాయి**

మందులు, ఆహార పదార్థాల దిగుమతిపై బేసిక్ కస్టమ్స్ మినహాయింపును బడ్జెట్‌లో ప్రకటించామని, ఈ జాబితాలో అదనంగా ఏడురకాల అరుదైన వ్యాధులను చేర్చామని, ఇది రోగులకు పెద్ద ఉపశమనం కలిగిస్తుందని నిర్మలా సీతారామన్ చెప్పారు. 17 రకాల క్యాన్సర్ నిరోధక ఔషధాలపై బేసిక్ కస్టమ్స్ డ్యూటీని రద్దు చేసినట్టు చెప్పారు.

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం పార్లమెంట్‌లో బడ్జెట్ 2026 ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్‌లోకి కీలక పది కీలకాంశాలు.

1. ఈసారి టాక్స్ పేయర్లకు పెద్దగా ఊరట లభించలేదు. ఏప్రిల్ 1 నుంచి అమలు కానున్న కొత్త పన్నుల్లో ఏవైనా పన్ను మినహాయింపులు, కోతలు ఉండొచ్చని భావించినా.. బడ్జెట్‌లో అలాంటివేమీ ప్రకటించలేదు. అయితే, దేశంలో పెట్టుబడులు పెట్టి, క్లౌడ్ సర్వీసెస్ అందించే డాటా సెంటర్లకు మాత్రం సరళమైన పన్నులు విధించారు. దీనిప్రకారం 2047 వరకు టాక్స్ హాలిడే ఉంటుంది.
2. కేన్సర్ పేషెంట్లకు ఊరట కలిగించేలా కీలక నిర్ణయం తీసుకున్నారు సీతారామన్. కేన్సర్ చికిత్స కోసం విదేశాల నుంచి దిగుమతి చేసుకునే అత్యావశ్యక ఔషధాలపై దిగుమతి సుంకాన్ని మినహాయిస్తారు. దీనిలో భాగంగా 17 రకాల ఔషధాలు ధరలు తగ్గుతాయి. అలాగే, అరుదైన వ్యాధుల చికిత్సకు ఉపయోగించే మరో 7 కీలక ఔషధాలపై కూడా దిగుమతి సుంకాలు తగ్గుతాయి. కేన్సర్ చికిత్సలో వాడే మందులు, ఇతర ఔషధాలు, ఆహార పదార్థాలు, పరికరాలపై కూడా సుంకాలు తగ్గుతాయి.
3. కొత్తగా వచ్చే టెక్నాలజీలపై సమీక్ష జరిపేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తారు. సెమీ కండక్టర్ల తయారీ సహా, ఇతర సేవారంగాలకు ప్రోత్సాహకంగా ఐదేళ్లలో రూ.40,000 కోట్లు కేటాయిస్తారు.
4. 202627 ఆర్థిక సంవత్సరానికిగాను సైన్యానికి రూ.2.19 లక్షల కోట్లు కేటాయిస్తారు. ఇది గత ఏడాదికంటే 21.84 శాతం అదనం. మొత్తం రక్షణ రంగానికి రూ.7.85 లక్షల కోట్లు కేటాయించారు. ఇది మన జీడీపీలో 11 శాతం.
5. వేగంగా, స్థిరమైన అభివృద్ధి సాధించేందుకు తయారీ రంగం, ఇతర చిన్న పరిశ్రమలు వంటి ఆరు కీలక రంగాకు ప్రోత్సాహం అందిస్తారు. ఇండియాను బయో గ్లోబల్ ఫార్మా హబ్‌గా మార్చేందుకు బయో ఫార్మ శక్తి మిషన్ పేరుతో ఐదేళ్లలో రూ.10,000 కోట్లు కేటాయిస్తారు.
6. మెగా టెక్స్‌టైల్ పార్కులు ఏర్పాటు చేసి వస్త్ర తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తారు. ఖాదీ, చేతి కళా ఉత్పత్తుల తయారీని ప్రోత్సహించేందుకు మహాత్మా గాంధీ గ్రామ సమాజ్ పథకాన్ని అమలు చేస్తారు.
7. బ్యాంకింగ్ రంగాన్ని సమీక్షించేందుకు ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తారు. అలాగే విదేశీ మారక వ్యవస్థను ప్రోత్సహించేందుకు, భారతీయ ఈక్విటీలలో విదేశీయులు పెట్టుబడులు పెట్టేందుకు కూడా కమిటీలను ఏర్పాటు చేస్తారు.
8. పలు ప్రధాన నగరాలకు ఏడు హై స్పీడ్ రైల్ నెట్‌వర్క్ ఏర్పాటు చేస్తారు. ఇందులో హైదరాబాద్‌కు సంబంధించి రెండు రైళ్లు నడుస్తాయి. ఒకటి చెన్నై, రెండోది పుణే.
9. రేర్ ఎర్త్ మినరల్స్ (అరుదైన ఖనిజాలు) కోసం చైనా వంటి దేశాలపై ఆధారపడకుండా నాలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక కారిడార్లు ఏర్పాటు చేస్తారు. తమిళనాడు, ఏపీ, కేరళ, ఒడిశాలో ఈ కారిడార్లు ఏర్పాటవుతాయి.
10. మెడికల్ టూరిజంను ప్రోత్సహించేందుకు ప్రత్యేక హబ్స్ ఏర్పాటు చేస్తారు. దీనిలో భాగంగా ఆయుష్ కేంద్రాల పేరుతో ఐదు మెడికల్ హబ్స్ ఏర్పాటు చేస్తారు.

### జోరందకున్న విమర్శలు..

**కేంద్ర విత్త మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం ప్రవేశపెట్టిన బడ్జెట్ 2026పై పలువురు ఆర్థిక నిపుణులు స్పందించారు. ఈ పద్దులో కాలయాపన తప్ప ఏమీ లేదని వ్యాఖ్యానిస్తున్నారు. ఈ బడ్జెట్‌పై భారీ అంచానాలను పెట్టుకున్న వ్యాపారవేత్తలు సహా సామాన్యులూ నిర్మలమ్మ పెదవి విరిచారు. ముఖ్యంగా వ్యక్తిగత ఆదాయం కలిగినవారికి పన్నుల నుంచి ఉపశమనం లభిస్తుందని భావించిన వేతన జీవులకు నిరాశే మిగలడం విమర్శలకు తావిచ్చింది.**



# మరో ఉద్యమంలా బీఆర్ఎస్ నిరసన!

**మొదటి పేజీ తరువాయి**

కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేవలం రాజకీయ ప్రతీకారంతోనే ఈ నోటీసులు ఇచ్చారని మండిపడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. భారీ మోటార్ సైకిల్ ర్యా లీలతో హోరెత్తించారు. కాంగ్రెస్ ప్రభు త్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనను వ్యక్తం చేశారు. కేసీఆర్ జోలికొస్తే తెలంగాణ ఊరుకోదని ఈ నిరసనలు స్పష్టం చేస్తు న్నాయి.

**ఇబ్రహీం పట్నంలో..**

తెలంగాణ రాష్ట్ర సాధనకు నాయకత్వం వహించి, తొలి ముఖ్యమంత్రిగా రాష్ట్రాభివృద్ధికి ఎనలేని సేవలందించిన బీఆర్ఎస్ పార్టీ అధినేత కె. చంద్రశేఖర్ రావు కి సిట్ నోటీసులు జారీ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలో బైక్ ర్యాలి నిర్వహించి అంబేద్కర్ చౌరస్తాకు వెళ్లి రోడ్డుపై బైఠాయించి, రాస్తారోకో చేసి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. జిల్లా పార్టీ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి , రాష్ట్ర నాయకు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి(బంటి) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ప్రశాంత్ రెడ్డి ని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు పోలీసులు తరలించారు.



# మద్యం ప్రియులకు షాక్ ఇచ్చిన బడ్జెట్ ..

కేంద్ర ప్రభుత్వం మద్యం ప్రియులకు షాక్ ఇచ్చింది. బడ్జెట్ 2026 27లో ఆల్కహాల్ రేట్లు పెంచే నిర్ణయం తీసుకుంది. ఆల్కహాల్ సెల్లర్స్, స్క్రాప్, మినరల్స్ నుంచి వసూలు చేస్తున్న ట్యాక్స్ కలెక్టెడ్ యాట్ సోర్స్(టీసీఎస్)ను 2 శాతంగా నిర్ణయించింది. గతంలో ఆల్కహాల్ సెల్లర్స్, స్క్రాప్, మినరల్స్‌పై టీసీఎస్ వివిధ రకాలుగా ఉండేది. కొన్ని సార్లు చాలా ఎక్కువగా ఉండేది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో ఈ రంగాలలోని సెల్లర్స్‌కు మేలు జరగనుంది. ట్యాక్స్ సిస్టమ్ సులభతరం కానుంది. సెల్లర్లకు పెను భారం తగ్గనుంది. ఈ ప్రకటనతో గవర్నమెంట్ ట్యాక్స్ కలెక్టింగ్ సిస్టమ్ బిజినెస్ ఫ్రెండ్లీగా మారే అవకాశం ఉంది. అయితే కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంతో ఆల్కహాల్ సెల్లర్లకు మంచి జరిగినా.. మద్యం తాగే వారికి మాత్రం నష్టం తప్పేలా లేదు. ఇకపై మద్యం రేట్లు పెరిగే అవకాశం ఉంది. కేవలం ఆల్కహాల్ రేట్లు మాత్రమే కాదు.. సిగరెట్లు, పాన్ మసాలా, పొగాకు ఉత్పత్తులపై భారీగా ప్రభావం పడనుంది. వాటి రేట్లు పెరిగే అవకాశం ఉంది. కాగా, కేంద్ర ప్రభుత్వం విదేశీ టూర్ ప్యాకేజీలపై టీసీఎస్‌ను తగ్గించింది. చదువులు, వైద్యంపై టీసీఎస్‌ను 5 శాతం నుంచి 2 శాతానికి తగ్గించింది.

# గర్జించిన రక్షణ

ఆపరేషన్ సిందూర్ అనంతరం ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్‌లో రక్షణ రంగానికి కేటాయింపులను కేంద్రం భారీగా పెంచింది. పాకిస్థాన్, చైనాలతో భద్రతా సవాళ్లు కొనసాగుతున్న తరుణంలో సైనిక పోరాట సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి ఈ చర్యను చేపట్టింది. 202627 బడ్జెట్లో రక్షణ రంగానికి రూ.7,84,678 కోట్లు కేటాయించింది. గత ఏడాది కేటాయింపుల (రూ.6.81 లక్షల కోట్ల)తో పోలిస్తే ఇది 15 శాతం అధికం. ఈ దఫా ప్రధానంగా ఆధునికీకరణకు పెద్దపీట వేశారు. ప్రభుత్వం 202627లో చేయదలిచిన వ్యయంలో రక్షణ వాటా 14.67 శాతంగా ఉంది. మంత్రిత్వ శాఖలన్నింటిలోకీ ఇదే అత్యధికం. మొత్తంమీద గత 26 ఏళ్లలో రక్షణ బడ్జెట్ 40 శాతం పెరిగింది. రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో)కు గత బడ్జెట్‌లో రూ.26,816.82 కోట్లు కేటాయించగా.. ఈ దఫా దాన్ని రూ.29,100 కోట్లకు పెంచారు. ఇందులో రూ.17,250.25 కోట్లను మూలధన వ్యయం కోసం ప్రత్యేకించారు. మాజీ సైనికోద్యోగుల కంట్రిబ్యూటరీ ఆరోగ్య పథకానికి గత ఏడాదితో పోలిస్తే 45.49 శాతం పెంచి, రూ.12,100 కోట్లను కేటాయించారు.

''ఆపరేషన్ సిందూర్‌లో చరిత్రాత్మక విజయం తర్వాత రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని నిర్ణయించాం. భద్రత, అభివృద్ధి, ఆత్మనిర్భర్‌ను సమతౌల్యం చేస్తూ ఈ బడ్జెట్‌ను సిద్ధంచేశారు'' అని బడ్జెట్ పై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. తాజాగా త్రివిధ దళాల ఆధునికీకరణకు రూ.1.85 లక్షల కోట్లను కేటాయించారని, మునుపటి ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 24 శాతం అధికమని పేర్కొన్నారు. దీనివల్ల మన సైనిక సామర్థ్యం మరింత బలోపేతమవుతుందన్నారు.

# ఏప్రిల్ 1 నుంచి అమలులోకి కొత్త ఆదాయపు పన్ను చట్టం....

**ట్యాక్స్ నిబంధనల సడలింపు: కేంద్ర మంత్రి నిర్మల.**
**ప్రజలే నేరుగా ఐటీ ఫైల్ చేసేలా మార్పులు.**
**విదేశీ ఆస్తుల ప్రకటనకు వన్ టైమ్ స్కీమ్.**
**మార్చి 31 వరకు ఐటీ చెల్లింపునకు గడువు.**
**జులై 31 వరకు అందుబాటులో ITR 1, ITR2.**




64 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ 1961 ఆదాయపు పన్ను చట్టం స్థానంలో కేంద్ర ప్రభుత్వం సరికొత్త 'ఆదాయపు పన్ను చట్టం2025' ను తీసుకొచ్చింది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2026 బడ్జెట్‌లో దీనికి సంబంధించి కీలక మార్పులను ప్రకటించారు. ఈ కొత్త చట్టం ఏప్రిల్ 1, 2026 నుంచి అమలులోకి రానుంది. సామాన్యులకు సైతం అర్థమయ్యేలా, ట్యాక్స్ ఫైలింగ్‌ను సులభతరం చేసేలా దీనిని రూపొందించారు.

కొత్త ఆదాయపు పన్ను చట్టంలోని ముఖ్యాంశాలను పరిశీలిస్తే ప్రధానంగా ఈ మార్పుల వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం.. చట్టాన్ని సరళీకరించడం, పన్ను చెల్లింపుదారుల ఇబ్బందులను తగ్గించడం కనిపిస్తుంది.

**1. సంక్లిష్టతకు స్వస్తి - సరళమైన భాష**

పాత చట్టం (1961)లో ఉన్న కఠినమైన న్యాయ పరిభాషను తొలగించి, సామాన్యులకు సులభంగా అర్థమయ్యే భాషలో కొత్త నిబంధనలను రూపొందించారు.

**సెక్షన్ల తగ్గింపు:**
గతంలో 819గా ఉన్న సెక్షన్లను 536కు తగ్గించారు.

**అధ్యాయాల కుదింపు:**
47 అధ్యాయాల నుంచి 23కు కుదించడం ద్వారా చట్టాన్ని మరింత స్పష్టంగా మార్చారు.

**పట్టికలు, ఫార్ములాలు:**
సుదీర్ఘమైన వివరణలకు బదులుగా, పన్ను లెక్కించడానికి 39 పట్టికలు 40 ఫార్ములాలను చేర్చారు.

**2. 'ట్యాక్స్ ఇయర్' విధానం.**

ఇప్పటివరకు ఉన్న 'ఫైనాన్షియల్ ఇయర్' (ఆదాయం వచ్చే ఏడాది) 'అసెస్మెంట్ ఇయర్' (పన్ను లెక్కించే ఏడాది) అనే రెండు వేర్వేరు సంవత్సరాల గందరగోళాన్ని తొలగిస్తూ, రెండింటినీ కలిపి ఒకే 'టాక్స్ ఇయర్' ప్రభుత్వం మార్చింది. దీనివల్ల ఏ ఏడాది ఆదాయానికి అదే ఏడాది లెక్కలు సరిచూసుకోవడం సులభమవుతుంది.

**3. సరళతరమైన ఐటీఆర్ ఫారాలు.**

పన్ను చెల్లింపుదారులు గంటల తరబడి కుస్తీ పట్టాల్సిన అవసరం లేకుండా త్వరలోనే కొత్త ఐటీఆర్ ఫారాలను అందుబాటులోకి తెస్తున్నారు.

**ముందుగా నింపిన ఫారాలు:** మీ జీతం, బ్యాంక్ వడ్డీ వంటి వివరాలు ఇప్పటికే ఫారంలో నింపి ఉంటాయి. మీరు కేవలం వాటిని సరిచూసుకుని 'సబ్మిట్' చేస్తే సరిపోతుంది.

**AI వినియోగం:** పన్ను నోటీసుల జారీ, అప్పీళ్ల ప్రక్రియలో వేగాన్ని పెంచడానికి ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సాంకేతికతను ఉపయోగిస్తున్నారు.

# డేంజర్ లో మేడిగడ్డ

**మొదటి పేజీ తరువాయి**

ఎన్‌డీఎస్‌ఏ సూచించిన జాగ్రత్తలను యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరింది.డ్యామ్ సేఫ్టీ యాక్ట్2021 ప్రకారం ప్రతి ఏటా వర్షాకాలం ముందు మరియు తర్వాత జలాశయాల భద్రతను తనిఖీ చేయడం తప్పనిసరి. 2025లో వర్షాకాలం ముందు 6,524 డ్యామ్‌లను, వర్షాకాలం తర్వాత 6,553 డ్యామ్‌లను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. భారతదేశంలో ప్రస్తుతం 50 ఏళ్లు పైబడిన జలాశయాలు 1,681 ఉన్నాయని కేంద్రం తెలిపింది. ఇవి కాలం చెల్లిన నిర్మాణాలు కావడంతో వీటి భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. గతంలో మేడిగడ్డ బ్యారేజీలోని పిల్లర్లు కుంగిపోవడం, పగుళ్లు రావడం వంటి ఘటనల నేపథ్యంలో కేంద్ర నిపుణుల కమిటీ పర్యవేక్షణ కొనసాగుతోంది. కేటగిరీ1 కింద వర్గీకరించడమంటే..నిర్మాణ పరంగా అది తీవ్రమైన వైఫల్యాలను ఎదుర్కొంటోందని అర్థం. మరమ్మతులలో జాప్యం జరిగితే దిగువన ఉన్న గ్రామాలపై దాని ప్రభావం పడే అవకాశం ఉంటుంది. జలాశయాల నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించకూడదని, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని నిరంతర పర్యవేక్షణ ఉండాలని కేంద్రమంత్రి సూచించారు

# ముగిసిన కేసీఆర్ విచారణ

**మొదటి పేజీ తరువాయి**

కేఎస్ రావు బృందం పాల్గొంది. కేసీఆర్ సమాధానాలను అధికారులు క్షుణ్ణంగా రికార్డు చేసుకున్నారు. ఇప్పటికే ఈ కేసులో భాగంగా గత వారం మాజీ మంత్రులు హరీష్ రావు, కేటీఆర్‌లను కూడా అధికారులు సుదీర్ఘంగా విచారించిన విషయం తెలిసిందే. అయితే కేసీఆర్ ఇచ్చిన సమాధానాల ఆధారంగా ఈ కేసులో తదుపరి నోటీసులు ఎవరికి అందనున్నాయి..? విచారణ ఏ మలుపు తిరగబోతోంది..? అన్నది ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

# ప్రజాస్వామ్యానికి విరుద్ధం : చిరుమర్తి లింగయ్య

**దశ, నకిరేకల్:** తెలంగాణ రాష్ట్ర సాధకుడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ని సిట్ విచారణకు పిలవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని నకిరేకల్ మాజీ మ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి చిరుమర్తి లింగయ్య తీవ్రంగా ఖండించారు.. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి పెట్టిన నాయకుడిని రాజకీయ కక్షతో విచారణ పేరుతో వేధించడం తగదని ఆయన అన్నారు. ప్రజల ఆకాంక్షలు, ఉద్యమాల త్యాగాలతో సాధించిన తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపించిన కేసీఆర్ గారి ప్రతిష్ఠను దెబ్బతీయాలనే ఉద్దేశంతోనే ఈ సిట్ విచారణ చేపట్టారని విమర్శించారు. ఇది పూర్తిగా రాజకీయ ప్రతీకార చర్యగా ఆయన అభివర్ణించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం బిఆర్ఎస్ పార్టీ శ్రేణుల పోరాటాలు ఇలానే కొనసాగుతాయని తెలిపారు. కేసీఆర్ గారిపై జరుగుతున్న అన్యాయాన్ని ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో తగిన సమాధానం ఇస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com